# సాక్షి జగిత్యాల

శుక్రవారం । 16 । జూన్ । 2023




### భరణి నక్షత్ర పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో గురువారం భరణి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

### పల్లెప్రగతిలో జెడ్పీ చైర్‌పర్సన్



జగిత్యాలఅగ్రికల్చర్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పల్లెప్రగతి కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పుష్పగుచ్ఛం అదజేశారు

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/30.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తీవ్ర వడ గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం లేదు.

## న్యూస్‌రీల్

### వయోవృద్ధులను వేధిస్తే శిక్షార్హులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

జగిత్యాల: వయోవృద్ధులను వేధిస్తే శిక్షార్హులని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా జగిత్యాల సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వృద్ధులకు సంబంధించిన వసతి గృహం త్వరగా పూర్తి చేయాలని, వయోవృద్ధులను వేధించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, హన్మంతరెడ్డి, ప్రకాశ్‌రావు, సయ్యద్ యూసూఫ్, ఎక్బాల్, యాకూబ్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డు ప్రదర్శిస్తున్న ఈవో, తదితరులు

జగిత్యాల : ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి పి.వేణుగోపాల్ హెచ్చరించారు. జగిత్యాల పట్టణం విద్యానగర్‌లోని శ్రీరామమందిరం భూమిలో గురువారం ఈఓ వేణుగోపాల్, ఆలయ చైర్మన్ కాశెట్టి తిరుపతి ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ 467,477, 479,480, 481 సర్వే నంబర్లలోని 9.09ఎకరాల విస్తీర్ణం కలిగిన శ్రీరామమందిరం భూమిని ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. ఆయన వెంట దేవాలయ రెనోవేషన్ కమిటీ సభ్యులు నర్సింగరావు, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్, గోపాల్ నాయక్, సిబ్బంది ఉన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడు సంవత్సరాల శిక్షణకు గాను 8 మంది షెడ్యూల్డ్ కులాల లా పట్టభద్రులను ఎంపిక చేసేందుకు ఉమ్మడి జిల్లాలో అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో ఈపాస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన లా పట్టభద్రులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి స్టైఫండ్, పుస్తకాలు, ఫర్నిచర్‌కు రూ.6 వేలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొంది, 2–4 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు.

### 16 నుంచి పాలీసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

జగిత్యాల: ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాలీసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 16 నుంచి 19 వరకు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్, పాలీసెట్ కన్వీనర్ అశోక్ తెలిపారు. విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని, ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతీ 30 నిమిషాలకొక స్లాట్ ఉంటుందన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రోజు, సమయానికి తప్పనిసరిగా కళాశాలలో అటెండ్ కావాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమవెంట ఎస్సెస్సీ మెమో, 1–10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, టీసీ, క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్సీ, పాలీసెట్ హాల్‌టికెట్, పాలీసెట్ ర్యాంక్ కార్డు, ఒరిజినల్, జిరాక్స్ తెచ్చుకోవాలని, స్లాట్ బుకింగ్ కాపీలను కూడా వెంట తెచ్చుకోవాలని వివరించారు.

### ఉపసర్పంచ్‌పై ఫిర్యాదు

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారం గ్రామ ఉపసర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి గురువారం ఎంపీవోకు ఫిర్యాదు చేశాడు. ఉప సర్పంచ్ నగునూరి రామకృష్ణకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, చట్ట ప్రకారం అతని ఎన్నిక చెల్లదని పేర్కొన్నారు. ఈ విషయంలో అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై త్వరలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో బుగ్గారం పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం విషయంలో సైతం జిల్లా ఉన్నతాధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై చివరి ఫలితం వచ్చేదాక తమ న్యాయ పోరాటం ఆగదని గంగారెడ్డి స్పష్టం చేశారు.

# నిధులున్నా నిర్లక్ష్యం



ఇది మెట్‌పల్లి మండలం రంగారావుపేట శివారులో నిర్మిస్తున్న వంతెన. గత వర్షాకాలంలో ఇక్కడ ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతినడంతో దాని స్థానంలో నూతనంగా నిర్మించడానికి ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసింది. ఇటీవల పనులు మొదలుపెట్టగా, ప్రస్తుతం 50 శాతం మేర పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి కావడానికి మరో నెల రోజులు పడుతోందని అధికారులు చెబుతున్నారు. ఆ లోపు భారీగా వర్షాలు కురిస్తే పనులకు ఆటంకం కలిగే అవకాశముంది.



ఇది మెట్‌పల్లి మండలం చింతలపేట శివారులోని ప్రధాన రహదారి. గత వర్షాకాలంలో ఇక్కడ ఉన్న కల్వర్టు దెబ్బతింది. తిరిగి దానిని నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంత వరకు పనులు మొదలుపెట్టలేదు. భారీ వర్షాలు కురిస్తే ఈ రోడ్డు నీట మునిగి రాకపోకలు నిలిచిపోతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

- గత వర్షాకాలంలో జిల్లాలోని చాలా గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు
- మరమ్మతుకు రూ.166 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- చాలా చోట్ల ప్రారంభం కాని పనులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- భారీ వర్షాలు పడితే రోడ్లు నీట మునిగే అవకాశం

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలో గతేడాది కురిసిన భారీ వర్షాలకు తీవ్ర నష్టం జరిగింది. ముఖ్యంగా చాలా చోట్ల రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. చెరువులు కోతకు గురయ్యాయి. దీంతో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కొంతకాలం క్రితం వీటి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే కొన్ని చోట్ల టెండర్లు పూర్తయి పనులు సాగుతుండగా, మరి కొన్ని చోట్ల ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటికే దెబ్బతిన్న రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ మొదలైంది. భారీ వర్షాలు కురిస్తే పనులు చేయడం సాధ్యం కాదు. సీజన్ ప్రారంభానికి ముందే పనులను పూర్తి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### పూర్తి చేస్తాం

గత వర్షాకాలంలో డ్యామేజ్ అయిన వాటి మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.136.98కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 71 పనులు చేయాలని నిర్ణయించాం. ఇందులో కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అన్ని పనులను తొందరలోనే పూర్తి చేస్తాం.

– శ్రీనివాస్‌రావు, ఎస్‌ఈ, ఆర్‌అండ్‌బీ

### 248 కిలోమీటర్ల రహదారి.. 35 వంతెనలు

- జిల్లాలో గత వర్షాకాలం సీజన్‌లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో 248 కిలోమీటర్ల మేర రహదారులు, 35 లోలెవల్ వంతెనలు దెబ్బతిన్నట్లు గుర్తించారు.
- ఇందులో జగిత్యాల నియోజకవర్గంలో 33.87 కిలోమీటర్ల రహదారి, 9 వంతెనలు, కోరుట్ల నియోజకవర్గంలో 28.33 కిలోమీటర్ల రహదారి, 16 వంతెనలు, ధర్మపురి నియోజకవర్గంలో 95.59 కిలోమీటర్ల రహదారి, 7 వంతెనలు.. చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లో 25.66కిలోమీటర్ల రహదారి.. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో 64.70 కిలోమీటర్ల రోడ్లు, 3 వంతెనలు ఉన్నాయి.
- రహదారుల మరమ్మతులకు రూ.74.24 కోట్లు, వంతెనల మరమ్మతుకు రూ.82.55కోట్లు, చెరువుల మరమ్మతులకు కావాల్సిన నిధుల కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.
- అయితే ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నిధులు విడుదల చేయగా, అధికారులు పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు.

### కొన్ని చోట్లనే పనులు ప్రారంభం

- మరమ్మతుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో చేపట్టే పనుల్లో దాదాపుగా అన్నింటికీ టెండర్లు పూర్తయినట్లు తెలిసింది.
- టెండర్ ప్రక్రియ పూర్తయిన వాటిలో ఇప్పటికి కొన్ని చోట్ల మాత్రమే పనులను ప్రారంభించారు. మిగతా చోట్ల కాంట్రాక్టర్లు ఇంకా మొదలుపెట్టలేదు.
- వర్షాకాలం సీజన్ ప్రారంభానికి ముందే అన్ని చోట్ల పనులను పూర్తి చేయాలి. కానీ ఇంకా ఎక్కడా కూడా పూర్తి కాలేదని సమాచారం. మొదలుపెట్టిన చోట వివిధ దశల్లో పనులు సాగుతుండగా, కొన్ని చోట్ల అసలే ప్రారంభం కాలేదు.
- మెట్‌పల్లి మండలంలోని రంగారావుపేట, చింతలపేట శివారుల్లో రెండు చోట్ల వంతెనలకు రూ.1.60కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో ఒక్క రంగారావుపేటలో మాత్రమే పనులు మొదలుపెట్టగా, చింతలపేటలో ఇంకా ప్రారంభించలేదు. అలాగే రహదారుల మరమ్మతుకు రూ.1.20 కోట్లు విడుదల చేయగా, అవి కూడా ఇంకా పూర్తి కాకపోవడం గమనార్హం.
- ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే వివిధ ప్రాంతాల్లో సాగుతున్న పనులు నిలిచిపోయే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు.

# కోరుట్ల బల్దియాకు అవార్డుల పంట

- హరితహారంలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు
- పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణలో మరో అవార్డు




కోరుట్లలో హరితహారంలో నాటిన మొక్కలు

కోరుట్ల: ఏడాది వ్యవధిలో వరుసగా పలు జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు అందుకుంటున్న కోరుట్ల మున్సిపాలిటీ దశాబ్ది ఉత్సవాల్లో మరో రెండు అవార్డులు సొంతం చేసుకుంది. శుక్రవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శిల్పకళా వేదికపై అవార్డులు అందజేయనున్నారు.

**ఏటా అవార్డులు**

మూడేళ్లుగా కోరుట్ల బల్దియాకు వివిధ రంగాల్లో జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు దక్కుతున్నాయి. 2021లో సుస్థిర పారిశుధ్య నిర్వహణ, వర్మి కంపోస్టు, పౌర సేవలు అంశాల్లో నేషనల్ స్కోప్ అవార్డు దక్కింది. 2022లో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఇండియన్ స్వచ్ఛతా లీగ్ అవార్డు వరించింది. అదే సంవత్సరంలో పట్టణ ప్రగతి విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి అవార్డును మంత్రి కేటీఆర్ అందజేశారు. 2023లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరిత హారం, సెంట్రల్ ప్లాంటేషన్ విభాగంలో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణలో మరో అవార్డును గురువారం తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.


### అందరి సహకారంతో..



కోరుట్ల మున్సిపాలిటీకి మూడేళ్లుగా అవార్డులు రావడంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ప్రోత్సాహం, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజల సహకారం మరువలేనిది. ఇదే రీతిలో కష్టపడి కోరుట్లను సుందరంగా తీర్చి దిద్దుతాం.

– అన్నం లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్

### లోపాలను సరిదిద్దుకుంటూ..



పారిశుధ్యం, పౌర సేవల్లో లోపాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారుల ను అప్రమత్తం చేస్తూ ఉన్నతాధికారుల గైడ్‌లైన్స్ పాటిస్తూ సరిదిద్దుతున్నాం. దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

– అయాజ్, మున్సిపల్ కమిషనర్

# పల్లె ప్రగతితో మారిన రూపురేఖలు



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మరిపోయాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎండపల్లి మండలం అంబరిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రగతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, అడిషనల్ కలెక్టర్ మంద మకరందతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పల్లె ప్రగతి కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. పల్లెప్రగతిలో భాగంగా చెత్తాచెదారం, మురుగు కాల్వలు, పరిసరాలు శుభ్రం చేయడం, ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలు వంటి కార్యక్రమాలతో పల్లెల్లో పరిశుభ్రత కనిపిస్తుందన్నారు. ప్రతీ గ్రామపంచాయతీకి ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీలు ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**దేశానికే ఆదర్శం**

గొల్లపల్లి(ధర్మపురి): పల్లెప్రగతితో గ్రామాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని మంత్రి ఈశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని శ్రీరాములపల్లిలో గ్రామ పంచాయతీ, ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ శంకర్, సర్పంచ్‌లు గంగారెడ్డి, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అందని సాయం

- 45 రోజులు గడుస్తున్నా చేతికందని పంట పరిహారం
- రెండో దఫాలో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో 97,311 మందికి తీవ్ర నష్టం
- మొత్తం 1.45 లక్షల ఎకరాల్లో పంటలు ధ్వంసం

**ఉమ్మడి జిల్లాలో పంటనష్టం.. రైతుల వివరాలు**

| జిల్లా | పంటనష్టం (ఎకరాల్లో) | బాధిత రైతులు |
|---|---|---|
| కరీంనగర్ | 56,066 | 40,417 |
| జగిత్యాల | 59,794 | 32,444 |
| పెద్దపల్లి | 21,948 | 17,560 |
| సిరిసిల్ల | 8,175 | 6,890 |
| మొత్తం | 1,45,983 | 97,311 |



ఇటీవల వడగండ్లు, ఈదురుగాలులకు సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లిలో నేలరాలిన మామిడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఈ ఏడాది యాసంగి పంట సమయంలో కురిసిన అకాల వర్షాలతో కలిగిన నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రైతులకు నేటికీ అందలేదు. మార్చిలో ఒకసారి, మే మొదటి వారంలో మరోసారి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరుణుడు విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో మొదటి విడతలో నష్టపోయిన పంటలను స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్‌లో పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని, ఇందుకు ఎకరాకు రూ.10వేల చొప్పున అందిస్తామని ప్రకటించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రూ.154 కోట్ల మేర పరిహారాన్ని ఇటీవల విడుదల చేశారు. పరిహారం జిల్లా వ్యవసాయ అధికారుల ద్వారా ఇప్పటికే రైతుల ఖాతాల్లో పడింది. అయితే.. మొదటి విడత కన్నా రెండో విడతలోనే పంటలు అధికంగా నష్టపోయాయి. ఆ పరిహారమే రైతులకు అధికంగా రావాల్సుంది. వానాకాలం పంటలు మొదలుపెట్టాలన్న అధికారుల సూచనల మేరకు చాలామంది రైతులు ఇప్పటికే సాగు పనులు ప్రారంభించారు. మరోవైపు జరిగిన నష్టానికి పరిహారం ఇంకా అందక రైతులంతా ఎదురుచూస్తున్నారు.

**వానాకాలం మొదలైనా..**

ఈ ఏడాది అకాల వర్షాలతో రైతులు గతంలో ఎన్నడూ చూడని నష్టాన్ని చవిచూశారు. వరి, మామిడి, మొక్కజొన్న, పుచ్చ, ఇతర వాణిజ్య పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. వాణిజ్య, కూరగాయల రైతులు పంటను కనీసం కోసుకోలేని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో వరిని విస్తారంగా పండిస్తారు. రాష్ట్రంలోనే అధిక వరి ఉత్పత్తి కేంద్రంగా పేరొందిన పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి వడగండ్లు, అకాల వర్షాలకు నష్టాలు కూడా అదే స్థాయిలో కనిపించాయి. సరిగ్గా పంట కోతకు వచ్చే సమయంలో వడగండ్లు, అకాలవర్షాలు, ఈదురుగాలుల కారణంగా గొలుసు దెబ్బతింది. ఫలితంగా గతేడాది కన్నా దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో పంట నష్టం, రైతుల వివరాలను సేకరించింది. సాయం అందుతుందని నెలరోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. మొదటి దఫా నష్ట పరిహారం కొందరికి అందినా.. తీవ్రనష్టాన్ని మిగిల్చిన రెండో దఫా పరిహారం ఇంకా అందకపోవడం వారిని తీవ్ర వేదనకు గురిచేస్తోంది.

**అధికంగా జగిత్యాలలోనే..**

పాత జిల్లాలో మొత్తంగా 1,45,983 ఎకరాల విస్తీర్ణంలో వరితోపాటు పలు రకాల వాణిజ్య పంటలు, కాయగూరల పంటలకు నష్టం వాటిల్లింది. జగిత్యాలలో అత్యధికంగా 59వేల ఎకరాల్లో 32 వేలకు పైగా రైతులు నష్టపోయారు. రైతుల సంఖ్యాపరంగా చూస్తే కరీంనగర్‌లోనే అధికంగా 40వేల మందికి పైగా నష్టపోయారు. అత్యల్పంగా సిరిసిల్లలో కేవలం ఎనిమిది వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. అయితే నెలన్నర గడుస్తున్నా నేటికీ ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది.

### పరిహారం రాలే



భారీ వర్షాలు, ఈదురు గాలులకు మూడు ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. కాయ మొత్తం నేల రాలింది. ఇప్పటివరకు రూపాయి పరిహారం రాలేదు. ఈసారి పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు. దిగుబడి తగ్గి చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– ఎడమల మహిపాల్‌రెడ్డి, రేచపల్లి, జగిత్యాల

### సాయం అందలే



నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా..ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షానికి పంట మొత్తం ధ్వంసమైంది. మంత్రి కేటీఆర్ కూడా మా వరి పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కూడా కల్పించారు. కానీ ఇప్పటివరకు ఆర్థిక సాయం అందలేదు.

– గంగదారి కుమార్, వీర్నపల్లి, రాజన్నసిరిసిల్ల

### చిల్లిగవ్వ ఇయ్యలే..



అకాల వర్షాలకు రెండు ఎకరాల పోలం, ఒక ఎకరం మొక్కజొన్న వర్షాలకు పూర్తిగా నేలపాలైంది. సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.10 వేలు ఇస్తానని ప్రకటించినా చేతికి చిల్లిగవ్వరాలేదు. మాలాంటి చిన్నకారు రైతులకు వెంటనే పరిహారం అందజేస్తే.. కాస్త ఉపశమనంగా ఉంటుంది.

– బోగి సంతోష్, నంసానిపల్లి, పెద్దపల్లి

### మంత్రి చూసినా లాభం లేదు



యాసంగిలో ఆరు ఎకరాలు కౌలు, సొంతం రెండు ఎకరాల్లో వరిపంట వేశాను. రెండు రోజుల్లో కోద్దామనుకుంటే వడగళ్ల వానకు పంటంతా పోయింది. వ్యవసాయాధికారులు సర్వే చేశారు. మంత్రి గంగుల కమలాకర్ వచ్చి నష్ట పరిహారం ఇప్పిస్తామని చెప్పినప్పటికీ ఇంత వరకు డబ్బులు రాలేదు.

– తోట శ్రీనివాస్, కౌలు రైతు, తాహెర్‌కొండాపూర్, కరీంనగర్

# కేసీఆర్ పాలనలో సంప్రదాయ పండుగలకు జీవం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ వసంత తదితరులు

జగిత్యాలరూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం తొమ్మిదేళ్ల కాలంలో అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని గొల్లపల్లె గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, రూ.5 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్ర పాలకుల చేతిలో తెలంగాణలోని గ్రామాలు తెలంగాణ యాస, భాష మరిచిపోయాయని, సీఎం కేసీఆర్ పోరాటంతో వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో సంప్రదాయ పండుగలకు జీవం పోశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. గొల్లకుర్మలకు ఆరాధ్య దైవమైన మల్లిఖార్జునస్వామి ఎలాగో కేసీఆర్ కూడా గొల్లకుర్మలకు గొర్రెల పథకం ద్వారా లబ్ధి చేకూర్చి వారికి దేవుడిగా నిలిచారన్నారు. అనంతరం ఉత్తమ సేవలు కనబర్చిన పారిశుధ్య కార్మికుడు రొట్ల లక్ష్మణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ ప్రకాశ్, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మమత, జెడ్పీ సీఈవో రామానుజచార్యులు, తహసీల్దార్ నవీన్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, డీఈ మిలింద్, ఏఈ రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పెళ్లి ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య


లక్ష్మణ్ (ఫైల్)

జగిత్యాలక్రైం: పెళ్లి ఇష్టం లేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాలు.. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన గాజంగి లక్ష్మణ్ (30) కొద్దిరోజులుగా వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. జీవితంలో స్థిరపడ్డ తర్వాత వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. కానీ కుటుంబ సభ్యులు వయస్సు పెరిగిపోతుందని బుజ్జగించి, వారం రోజుల క్రితం ఓ యువతితో వివాహం నిశ్చయించారు. ఈక్రమంలో స్థిరపడకుండా వివాహం చేసుకోవడం ఇబ్బందికరంగా ఉండడంతో మనస్తాపానికి గురైన లక్ష్మణ్ గురువారం మధ్యాహ్నం ఇంట్లో రేకుల పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణం పోచమ్మవాడకు చెందిన పుల్ల రాజేశ్ (30) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. రాజేశ్ కొద్దిరోజులుగా మద్యానికి బానిసవడంతో విపరీతంగా అప్పులు చేశాడు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 10న పురుగులమందు తాగగా, కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచనల మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి పుల్ల హన్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై నజీమొద్దీన్ తెలిపారు.

### చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మల్లాపూర్(కోరుట్ల): ఎస్సారెస్పీ ముంపు గ్రామం కుస్తాపూర్‌లో 1971లో నిర్మించిన మంచినీటి బావిని కబ్జా చేసిన వ్యక్తిపై కఠిన చర్య తీసుకోవాలని, పంచాయతీరాజ్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై సైతం చర్యలు తీసుకోవాలని గ్రామ ఆలయ కమిటీ సభ్యులు, వార్డుసభ్యులు గురువారం వేర్వేరుగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఆర్డీవో వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వార్డుసభ్యులు ద్యాగ గంగారెడ్డి, ఈర రాజేందర్, ఆలయ కమిటీ సభ్యులు రాజేందర్, భూమయ్య, మల్లయ్య, గణపతి, మోహన్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



# అలంకారప్రాయమే


ఇది ప్రభుత్వ ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి. ఎప్పుడూ తాళం వేసి ఉండడంతో ప్రజలకు ఉపయోగపడటం లేదు. ఇక్కడ అత్యధికంగా రద్దీ ఉంటుంది. నిర్వహణ లేక ఇదిసైతం మూతపడింది.


ఇది ఎల్లఅంగడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి. ఆరునెలలుగా మూతపడి ఉంది. నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. అధికారులు సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- నిర్వహణపై చేతులెత్తేసిన మహిళా సంఘాలు
- ఇబ్బంది పడుతున్న మహిళలు

జగిత్యాల: ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగానే మారాయి. జిల్లా కేంద్రంలో టాయిలెట్స్ ఏర్పాటు చేయగా, పలు చోట్ల నిర్వహణ లేక ఎప్పుడూ తాళాలు వేసే ఉంటున్నాయి. వాటి నిర్వహణను గతంలో మహిళా సంఘాలకు అప్పగించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు.

**నిర్వహణ లేక..**

జిల్లా కేంద్రంలో కొన్ని చోట్లనే టాయిలెట్స్ ప్రారంభించినా వాటి నిర్వహణ సక్రమంగా ఉండంలేదు. మొదట్లో మహిళా సంఘాలకు మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యత ఇవ్వగా, వారు హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు లీజుకు ఇచ్చారు. వారు సైతం సక్రమంగా నిర్వహించడంలేదు. నిర్వహణ తమవల్ల కాదని ఇటీవల మహిళా సంఘాల సభ్యులు మున్సిపల్ అధికారులకు లేఖ రాశారు. ఇటీవల టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. జిల్లా కేంద్రంలో ఒక్కోదానికి రూ.6.5 లక్షల వ్యయంతో 8 ఏర్పాటు చేయగా అంతంత మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఒక మరుగుదొడ్డిలో స్వీపర్, విద్యుత్, శానిటైజర్, సబ్బులు అందుబాటులో ఉండాలి. బోరు సౌకర్యం లేని చోట మున్సిపల్ నీరు అందించాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా అందుబాటులో లేవు. దీంతో నిర్వహణ గాలికొదిలేస్తున్నారు. ట్యాంకులు పగలడం, నీటి సమస్య తలెత్తడంతో అధికారులు మరమ్మతులు చేపట్టడంలో విఫలమవుతున్నారు.

**మహిళలకు ఇబ్బందులు**

జిల్లా కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది పలు పనుల నిమిత్తం వస్తుంటారు. ఈనేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అవి నిరుపయోగంగా ఉండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**టెండర్లు పిలిచాం**



మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించడం జరిగింది. ప్రస్తుతం వారు బాధ్యతలు విరమించుకున్నారు. గతంలో ఉన్న వారితోనే కొనసాగిస్తున్నాం. టెండర్లు వేసి అన్ని మరుగుదొడ్లలో సిబ్బందిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
– నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

# చెన్నకేశవనాథా.. నీ భూములెక్కడ?

- రెవెన్యూ రికార్డుల్లో లేని ఆలయ భూముల వివరాలు
- విలువ దాదాపు రూ.10 కోట్లపైనే..


చెన్నకేశవనాథ స్వామి ఆలయం

రాయికల్(జగిత్యాల): అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో విలువైన దేవాలయ భూములు లేకుండా పోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో రాయికల్ శ్రీచెన్నకేశవనాథ పంచముఖ లింగేశ్వర సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూములపై అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఆలయాన్ని కాకతీయ ప్రతాప రుద్రుడి సమయంలో నిర్మించినట్లు క్రీ.శ. 1305 ఆగస్టు 17న శాసనాన్ని ప్రతిష్ఠించారు. ఈ దేవాలయ ఆలనాపాలన కోసం కొంత నగదు, 10 ఎకరాల భూములు ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు. 1971లో జరిగిన జిల్లా పురావస్తు పరిశోధన శాఖ సర్వేలో దేవనాగరి లిపిలో ఉన్న శాసనం ఆలయ ప్రాంగణంలో లభించినట్లు ఇన్స్క్రిప్షన్ ఆన్ ఏపీ కరీంనగర్ అనే గ్రంథంలో ఉంది. కానీ ఈ ఆలయ ఆలయ భూముల వ్యవహారం అంతు చిక్కడం లేదు. సంబంధిత రికార్డులు అందుబాటులో లేకపోవడంతో భూములు ఎక్కడున్నాయో తెలియడం లేదు. ప్రస్తుతం ఇక్కడ ఒక్కో గుంటకు రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు ధర పలుకుతోంది. రాయికల్ శివారు ప్రాంతంలో ఈ దేవాలయానికి చెందిన భూముల విలువ దాదాపు రూ.10 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. వెంటనే విచారణ జరపాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌ను వివరణ కోరగా సదరు భూముల వివరాల కోసం రికార్డుల్లో వెతుకుతున్నామని, ఇప్పటికైతే లేవని తెలిపారు.

# పథకాలతో లబ్ధిదారుల్లో ఆత్మవిశ్వాసం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


పల్లెప్రగతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): పల్లె ప్రగతి కార్యక్రమం అమలుతో రాష్ట్రంలోని పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని సిరిపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర సహకారం లేకున్నా సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల్లో ఆత్మవిశ్వాసం పెంచామని వెల్లడించారు. అనంతరం పల్లెప్రగతిలో మూలస్తంభాలైన పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. మండల వ్యాప్తంగా 60మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో జగదీశ్, సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతితోనే సంపూర్ణ అభివృద్ధి

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు


మాచాపూర్‌లో పంచాయతీ భవనం పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, నాయకులు

కథలాపూర్(వేములవాడ): పల్లె ప్రగతి కార్యక్రమంతోనే గ్రామాలు సంపూర్ణ అభివృద్ధి చెందాయని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. గురువారం మేడిపెల్లి మండలం కొండాపూర్, విలయాతబాద్, మాచాపూర్ గ్రామాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. విలయాతబాద్, మాచాపూర్ గ్రామాల్లో రూ.20 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవనం పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉద్యమాలు చేసి ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న ఘనత మనదేనని, అదే స్ఫూర్తితో అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తున్నామన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైకుంఠధామాలు, వన నర్సరీలు, క్రీడాప్రాంగణాలు, పల్లె దవఖానాలు ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని వసతులు సమకూర్చామన్నారు. వచ్చే నెలలో గృహలక్ష్మి పథకం ప్రారంభిస్తామని, అర్హులైనవారికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీపీ ఉమాదేవి, ఏఎంసీ చైర్మన్ రమ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్తిరెడ్డి, సర్పంచులు అభిలాశ్, బాలరాజు, వెల్మ సమత పాల్గొన్నారు.

# రైతుసేవ కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు

- జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్


రైతు సేవ కేంద్రాల నిర్వాహకులతో డీఏవో

జగిత్యాలఅగ్రికల్చర్: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రైతుసేవ కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను సరసమైన ధరలకు రైతులకు అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాల నిర్వాహకులకు వానాకాలం సీజన్‌పై గురువారం అంబారిపేటలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఆధునిక పనిముట్లను సైతం రైతు సేవ కేంద్రాల ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతు సేవ కేంద్రాలకు వచ్చే రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలు సైతం ఇవ్వాలని కోరారు. ఇందు కోసం కేంద్రాల నిర్వాహకులు వ్యవసాయంపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ ఏడీఏ కల్పన, మండల వ్యవసాయాధికారి వినీల, ఏఈవో నరేశ్, ఆగ్రోస్ సూపర్‌వైజర్ వికాస్, ఆగ్రోస్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మధుసూదన్, నిర్వాహకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


కరపత్రం ఆవిష్కరిస్తున్న జీవన్‌రెడ్డి, నాయకులు

జగిత్యాలటౌన్: కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల కరపత్రాన్ని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యకం చేశారు. తాము అధికారంలోకి రాగానే ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉసురు పోసుకుంటున్న 317జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని కోరారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, గాజుల రాజేందర్, మన్సూర్, నేహాల్, గుండ మధు, సాదుల వినయ్, బీరం రాజేష్, లైశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**అసహనానికి లోనవుతున్న మంత్రి**

సారంగాపూర్(జగిత్యాల): అభివృద్ధి పనుల్లో తప్పులను ఎత్తిచూపితే మంత్రి ఈశ్వర్ అసహనానికి లోనవుతూ మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం బీర్‌పూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. రోల్లవాగు ప్రాజెక్టు గురించి మంత్రికి ఏమైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో వందల కోట్లు వెచ్చించి ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి సాగు విస్తీర్ణం పెంచామని వివరించారు. జిల్లాలో రైతులకు చెక్కెర కర్మాగారం కావాలా, ఇథనాల్ ప్రాజెక్టు కావాల అన్న దానిపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని మంత్రికి సూచించారు. ఆయన వెంట ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటిసి పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, నాయకులు గుడిసె జితేందర్, చెర్పూరి సుభాష్, కోండ్ర రాంచంద్రారెడ్డి, ఆకుల రాజిరెడ్డి, ఏనుగు జోగిరెడ్డి, నారపాక కమలాకర్ తదితరులు ఉన్నారు.

# రైతుల నోట్లో మట్టికొట్టిన మంత్రి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): కాళేశ్వరం లింక్–2 ప్రాజెక్టు కింద ఏడాదికి మూడు పంటలు పండే భూములకు ఎకరానికి రూ.9 లక్షలు చెల్లించి.. రైతుల నోట్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ మట్టికొట్టారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని పాశి గామ వద్ద ఇథనాల్ బాధిత గ్రామాలైన పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమతో ఎలాంటి కాలుష్యం ఉండదని, కేవలం రాజ కీయ లబ్ధి కోసమే ప్రజలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రెచ్చగొడుతున్నారని మంత్రి అన్న మాటలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఫ్యాక్టరీ వల్ల ఎలాంటి కాలుష్యం ఉండదని నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని అడ్లూరి సంచలన వ్యా ఖ్యలు చేశారు. నిరూపించకుంటే మంత్రి ముక్కు నేలకు రాయడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. 2004కు ముందు మంత్రి ఆస్తులు ఎంత ఇప్పుడు ఎంతనో ప్రజలకు వివరించాలన్నారు.

**బ్లాస్టింగ్‌లతో దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన**

కాళేశ్వరం లింక్–2 పనుల్లో మెగా కంపెనీ అనుమతులు లేకుండా, సమయపాలన పాటించకుండా బ్లాస్టింగ్‌లు చేయడంతో సమీపంలోని దెబ్బతిన్న ఇళ్లను అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరిశీలించారు. ఇళ్లపై రాళ్లు పడి, ఇక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారని, గోడలు బీటలు వారుతున్నాయని కాలనీవాసులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. నాలుగు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం చూపకుంటే కాలనీవాసులతో కలిసి రాష్ట్ర రహదారిపై పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎల్‌డీఎం ఇన్‌చార్జి శ్రీకాంత్, వెల్గటూర్ సర్పంచ్ మురళీగౌడ్, ఎంపీటీసీ మంజుల, యూత్ మండల అధ్యక్షుడు పూదరి రమేష్, మండల అధికార ప్రతినిధి విజయ్, బందెల ఉదయ్, మేరుగు నరేష్, గోళ్ల తిరుపతి, గెల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పాతపెన్షన్ వర్తింపజేయాలి

మల్లాపూర్(కోరుట్ల): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తించేయాలని పాత పెన్షన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎగ్యారపు వెంకటేశ్ అన్నారు. గురువారం మండలంలోని సిరిపూర్ గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2004 నుంచి ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం అమలు చేస్తోందని, కాని అంతకుముందే డీఎస్సీ–2003 నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించి ఫలితాలు కూడా వెల్లడించారని తెలిపారు. అప్పుడు డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులతో నియమాకాలు చేపట్టడానికి ప్రభుత్వ విధానపరమైన ఉత్వర్వులు విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 2 ఏళ్ల ఉపాధ్యాయులుగా నియామకానికి నోచుకోలేదన్నారు. రెండేళ్ల అనంతరం 2005లో నియామకాలు చేపట్టడం వల్ల ప్రభుత్వం మార్పు చేసిన నూతన పెన్షన్ విధానంలోకి వచ్చామని ఆవేదన వ్యక్తంచేశారు. డీఎస్సీ 2003 నోటిఫికేషన్ ప్రకారం ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ప్రభుత్వం న్యాయపరంగా పాతపెన్షన్ వర్తింపజేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు వెంకటేశ్ తెలిపారు.

# జరిమానా చెల్లిస్తేనే మిల్లింగ్‌కు అనుమతి

మల్యాల(చొప్పదండి): మండలంలోని బల్వంతాపూర్ గ్రామ శివారులోగల శ్వేత రైస్‌మిల్లులో గురువారం సివిల్ సప్‌లై అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2021–22 ఖరీఫ్ పంటకు సంబంధించి మిల్లింగ్ పెండింగ్ ఉండడంతో తనిఖీ చేసి, ధాన్యం నిల్వలు ఉన్నట్లు తేల్చారు. గతేడాది ప్రభుత్వానికి బకాయి పడిన దానిపై 25శాతం జరిమానా చెల్లించాలని ఆదేశించారు. తక్షణమే రూ.9లక్షలు జరిమానా చెల్లించాలని లేకుంటే మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో డీటీసీఎస్ ఆనంద్, వరప్రసాద్, మెట్‌పల్లి డీటీసీఎస్ శ్రీనివాస్, టెక్నికల్ సిబ్బంది వంశీ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో చోరీ

కోరుట్ల: పట్టణంలోని భీమునిదుబ్బ శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం హుండీ పగులగొట్టి సుమారు రూ. 30వేల నగదు, వెండి ప్రతిమలు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన రాజిరెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని హుస్సేన్‌నగర్ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కథనం ప్రకారం.. మల్లాపూర్ మండలకేంద్రానికి చెందిన పంపుల రాజిరెడ్డి(60) ఓ శుభకార్యానికి బైక్‌పై ముత్యంపేటకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, హుస్సేన్‌నగర్ శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో రాజిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారంతో కుటుంబసభ్యులు ఘటనస్థలానికి వెళ్లి రాజిరెడ్డిని మెరుగైన చికిత్స నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.